క్లుప్తంగా

నేడు శివాలయంలో ఏరువాక పౌర్ణమి ప్రత్యేక పూజలు

రెంటచింతల: ఏరువాక పౌర్ణమి సందర్భంగా బుధవారం స్థానిక శివాలయంలోని విగ్నేశ్వర స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటల సమయంలో నిర్వహించే ఈ పూజా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు, భక్తులు పాల్గొని స్వామివారి చల్లని దీవెనలు పొందాలని కోరారు.

పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసులు



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ మున్సిపల్ కమిషనర్‌గా ఐ.శ్రీనివాసులు బదిలీపై రానున్నారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలుపడ్డాయి. ప్రస్తుతం పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న పర్వతనేని శ్రీధర్‌ను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వద్దేశ్వరానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలుపడ్డాయి. త్వరలో ఐ.శ్రీనివాసులు పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

తల్లికి వందనం పథకానికి ఈకేవైసీ తప్పనిసరి

మాచవరం: మండలంలో అన్ని గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం నగదు జమ చేయుటకు ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయాల్లో హౌస్ హోల్డ్ డేటా నమోదు చేయించుకోవాలని ఎంఈఓ డి.శ్రీధర్ తెలిపారు. హౌస్‌హోల్డ్ నమోదు తర్వాత ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలని, తదుపరి బ్యాంక్ ఖాతాకు సంబంధించి ఎన్‌పీసీఐ లింక్ చేసుకోవాల్సి ఉందని చెప్పారు.

నేడు పిల్లుట్లలో ఉచిత వైద్య శిబిరం

మాచవరం: మండలంలోని పిల్లుట్లలో పాత పంచాయతీ కార్యాలయంలో ఉన్నం చారిటబుల్ ట్రస్టు, ఉన్నం హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో చిన్న పిల్లల వ్యాధులు, సీజనల్, ఇతర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు చెప్పారు.

రీసర్వే త్వరితగతిన పూర్తి చేయాలి



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): రీ సర్వే ప్రక్రియ మొదటి దశను త్వరితగతిన పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు పేర్కొన్నారు. మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను మంగళవారం తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ఇప్పటివరకు జరిగిన సర్వే వివరాలు పరిశీలించారు. అక్కడే ఉన్న రైతులతోను మాట్లాడి సర్వే పై అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. రైతులు కూడా భూములకు సంబంధించిన ఆధారాలను సర్వే సిబ్బందికి అందించి సహకరించాలని కోరారు. ఇప్పటివరకు గోళ్ళపాడు రెవెన్యూ గ్రామపరిధిలో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ చివరి దశకు చేరిందని, అనంతరం అభ్యంతరాలపై రైతులకు నోటీసులు అందించటం జరుగుతుందన్నారు. గ్రామ సర్వేయర్ నాగూర్‌మీరా, సర్వే సిబ్బంది తదితరులు ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ నిందితుడికి జరిమానా

నాదెండ్ల: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముద్దాయికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ చిలకలూరిపేట అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ (2వ తరగతి) స్వాతి తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దుర్గి గ్రామానికి చెందిన పున్నా సాయికుమార్ మద్యం తాగి కారు నడుపుతుండగా, గణపవరం మెయిన్‌సెంటర్‌లో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డాడు. అతనిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచగా, న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

శావల్యాపురం: రైతుసేవా కేంద్రాల్లో సన్నచిన్నకారు రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు తెలిపారు. మంగళవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో ఏవో మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు ద్వారా పంటలు సాగు చేయాలన్నారు. రైతుసేవా కేంద్రాల్లో జీలుగులు 10 కేజీల సంచి రాయితీ మినహాయించి రూ.545కు అందజేస్తున్నట్లు తెలిపారు. పిల్లిపెసర 8 కేజీల సంచి 720 రూపాయలు, జనుము విత్తనాలు 10 కేజీల సంచి 615 రూపాయలకు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

పీఎం సూర్య ఘర్‌తో జీరో కరెంటు బిల్లు

విద్యుత్ ఎస్ఈ విజయకుమార్



పిడుగురాళ్లలో మాట్లాడుతున్న ఎస్ఈ

పిడుగురాళ్ల: పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్ జీరో వస్తుందని గృహ వినియోగదారులు అందరూ ఈ పథకాన్ని సద్వినియోగ చేసుకోవాలని పల్నాడు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ ప్రత్తిపాటి విజయ్ కుమార్ తెలిపారు. పట్టణంలోని భవనాసి కల్యాణ మండపంలో మంగళవారం పీఎం సూర్య ఘర్ పథకంపై విద్యుత్ వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లకు రూఫ్ టాప్ సోలార్ ప్యానల్స్‌లో కెపాసిటీకి సరిపడా ఏర్పాటు చేసుకోవడం ద్వారా ప్రభుత్వం వినియోగదారులకు సబ్సిడీ అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఒక కిలో వాట్ నుంచి రెండు కిలో వాట్ల వరకు రూ.30 వేల నుంచి రూ.60 వేలు సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే రెండు కిలో వాట్ నుంచి మూడు కిలో వాట్స్ వరకు రూ.60 నుంచి రూ.78 వేల వరకు సబ్సిడీ వర్తిస్తుందని వివరించారు. వినియోగదారులు బ్యాంకుల ద్వారా, విద్యుత్ శాఖ ద్వారా ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవచ్చు అని ఈ సందర్భంగా తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఒక నెలరోజుల వ్యవధిలోనే సబ్సిడీ వచ్చే విధంగా విద్యుత్ శాఖ, సోలార్ డిస్ట్రిబ్యూటర్లు కృషి చేస్తారని చెప్పారు. ఒక కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేయడానికి సుమారు ఇంటి మీద ఆరు చదరపు మీటర్ల స్థలం అవసరం అన్నారు. ఒక కిలో వాట్ రూఫ్ టాప్ కెపాసిటీ కోసం రెండు ప్యానల్స్ ఒక మీటర్ వెడల్పు 1.6 మీటర్ల ఎత్తు కొలతలతో అమర్చబడతాయని, అప్పుడు విద్యుత్ ఉత్పత్తి అవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకుని గృహాలకు వినియోగించుకోవడం ద్వారా కరెంట్ బిల్లులు ఆదా చేసుకోవచ్చన్నారు. అలాగే ఉత్పత్తి అయిన విద్యుత్‌లో మిగులు ఉంటే ఆదాయాన్ని కూడా పొందవచ్చని వివరించారు. అలాగే గృహ వినియోగదారులు అదనపులోడును క్రమబద్ధీకరణ చేసుకోవాలని అందుకు నెలాఖరు వరకు సమయం ఉందని ప్రతి ఒక్కరూ క్రమబద్ధీకరణ చేసుకోవాల్సిందిగా సూచించారు. విద్యుత్ వినియోగదారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఇప్పటికే సోలార్ వాడుతున్న వినియోగదారుల అనుభవాలను సమావేశానికి హాజరైన వారికి వివరించారు. కార్యక్రమంలో మాచర్ల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సూతలపాటి సింగయ్య, పల్నాడు జిల్లా సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్నాంజనేయ దేవస్థానం వార్షికోత్సవం



ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన ప్రసన్నాంజనేయ స్వామివారు

రెంటాల(రెంటచింతల): గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామివార్ల కల్యాణం నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు సన్నిగండ్ల గోపాలాచార్యులు నేతృత్వంలో పూరిమెట్ల శేషభట్టాచార్యులు స్వామివార్లకు ప్రత్యేక అలంకారాలు, సుప్రభాత సేవ, తోరణం కట్టుట, ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, అర్చన, హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామిని ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శమిచ్చారు. భక్తులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళలు ప్రదర్శించిన కోలాటం విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఈ వార్షిక మహోత్సవ వేడుకల్లో పాల్గొన్న వేలాది మంది భక్తులకు బీజేపీ యువజన నాయకులు ఇగుటూరి రాజశేఖర్‌రెడ్డి మహా అన్నదానం కార్యక్రమం చేపట్టారు. దేవస్థానం కమిటీ చైర్మన్, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవస్థానాన్ని రంగురంగుల విద్యుత్ తోరణాలతో అందంగా అలంకరించారు.

ఇంజినీరింగ్ కార్మికుల ధర్నా



పిడుగురాళ్ల మున్సిపల్ ఆఫీస్ వద్ద ధర్నా చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

పిడుగురాళ్ల: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పిడుగురాళ్ల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్‌ను కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులతో చర్చలు జరిపి వారి డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. పండుగ సెలవులు, క్యాజువల్ లీవులు అమలు చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీగా ఉద్యమం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు కాంట్రగుంట రాజు, కోపూరు విజయ్, రమేష్, గద్దె శ్రీను, వెంకయ్య, వేముల శ్రీనివాసరావు మధు, రవికుమార్, కొండలు, గుంటి నాగేశ్వరరావు, కంప సాగర్ బాబు పాల్గొన్నారు.

పీఎండీఎస్ విత్తనాల వినియోగానికి ప్రోత్సాహం

- ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం కె.అమల కుమారి
- ఉన్నవ గ్రామ సందర్శన
- ప్రకృతి రైతులకు ప్రీ మాన్సూన్ డ్రైవ్ సోయింగ్‌పై అవగాహన



విత్తనాలను పంపిణీ చేస్తున్న అమలకుమారి

యడ్లపాడు: మండలంలోని ఉన్నవ గ్రామంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.మల కుమారి ఏపీఎం (నాన్ పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్) షాప్‌ను సందర్శించారు. గ్రామానికి చెందిన కోటేశ్వరమ్మ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ షాప్ ద్వారా రైతులకు ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన ఘన జీవామృతం, కషాయాలు, పీఎండీఎస్ విత్తనాలు లభ్యమవుతున్నాయని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ, ప్రస్తుత వర్షాకాలాన్ని ఉపయోగించుకొని రైతులు తమ పొలాల్లో ప్రీ-మాన్సూన్ డ్రైవ్ సోయింగ్ విత్తనాలను వేసుకోవాలని సూచించారు. ఇది ఖరీఫ్ పంటలకు ముందు భూమిని సన్నద్ధం చేసేందుకు ఎంతగానో సహకరిస్తుందని చెప్పారు. ఈ కిట్లో 30 రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. వాటిలో పప్పు ధాన్యాలు.. మినుము, పెసర, బొబ్బర్లు, నూనె జాతులు.. నువ్వులు, ఆముదం, వేరుశనగ, సుగంధ ద్రవ్యాలు..ధనియాలు, మెంతులు, ఆవాలు, ధాన్యాలు.. రాగులు, మొక్కజొన్న, కొర్రలు, కూరగాయలు, ఆకుకూరలు, తీగజాతులు మొదలైనవి ఉంటాయని తెలిపారు. ఈ విధానం సాగు వల్ల భూమి ఏడాది పొడవునా కప్పబడి ఉండటంతో, నేలలో సూక్ష్మజీవజాల అభివృద్ధికి అనుకూలంగా మారుతుందన్నారు. దీంతో ప్రధాన పంటలకు అవసరమైన పోషకాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఇలా నవధాన్యాల ఉత్పత్తికి తోడ్పడడమే కాకుండా, పశువులకు పోషక మేతగా కూడా ఉపయోగపడుతుందని రైతులకు అవగాహన కల్పించారు. అలాగే పీఎండీఎస్ విత్తనాల వినియోగం వల్ల వర్షపు నీటి నిల్వ సామర్థ్యం పెరగడం, అదనపు పంటల ద్వారా రైతులకు ఆదాయం లభిస్తుందన్నారు. నేల సారాన్ని మెరుగుపరచి జీవవైవిధ్యాన్ని కాపాడుతుందని తెలిపారు. రసాయన వాడకాన్ని తగ్గుతుందని, కలుపు, తెగుళ్ల సమస్యలు తగ్గి.. పంట వాతావరణ మార్పులకు తట్టుకునే స్థాయికి చేరతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జ్ కోటేశ్వరమ్మ, మాస్టర్ ట్రైనర్ బేబీరాణి, పాములు తదితరులు పాల్గొన్నారు.

మోహన్‌బాబు, విష్ణు బుద్ధి మార్చుకోవాలి

సత్తెనపల్లి: సినీ నటులు మంచు మోహన్ బాబు, మంచు విష్ణులు పరిశ్రమలో ఫ్లాప్ రాజాలుగా వెలుగొందుతున్నారని, ఇకనైనా బుద్ధి మార్చుకోవాలని బ్రాహ్మణ ఐక్యవేదిక సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షుడు పెద్దింటి ఫణి కృష్ణ అన్నారు. పట్టణంలోని సోమవారం నిర్వహించి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫణి కృష్ణ మాట్లాడుతూ వారు ఫేమ్ లోకి రావడం కోసం శ్రీకాళహస్తి చరిత్రను వక్రీకరిస్తూ కన్నప్ప అనే చిత్రాన్ని తీస్తున్నారని పోస్టర్లలో 'పిలక గిలక' పాత్రలతో జుగుప్సాకరంగా వేయడం జరిగిందన్నారు. దీనిని ఖండిస్తున్నామన్నారు. దీనిపై రాష్ట్ర బ్రాహ్మణ చైతన్య వేదిక, అర్చక సేవాసంఘం, సనాతన ధర్మ పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో ఇప్పటికే రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటిషన్ వేశామన్నారు. బ్రాహ్మణులపై వెకిలి సన్నివేశాలు పెట్టాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో బ్రాహ్మణ ఐక్యవేదిక సత్తెనపల్లి డివిజన్ ప్రధాన కార్యదర్శి అంపిరాయని రాజశేఖర్ శర్మ, కోశాధికారి కొడవడిగంటి నాగపార్వతి శర్మ, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి వార్షిక తిరునాళ్ల

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో వేంచేసియున్న వేంకటేశ్వర స్వామి వార్షిక తిరునాళ్ల మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. తిరునాళ్లలో భాగంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి కల్యాణం, అనంతరం భక్తి గీతాలాపన నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు శిరిగిరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన మంచి నీళ్లు ఉచితంగా ఇవ్వాలి

- ఏపీసీఆర్‌పీఓ ప్రతినిధుల డిమాండ్
- జాయింట్ కలెక్టర్‌కు వినతి



జేసీ సూరజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

నరసరావుపేట: జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ఉచితంగా శుభ్రమైన తాగునీరు అందించాల్సి ఉండగా, ఈ నిబంధనను పాటించకుండా వినియోగదారులను బలవంతంగా నీటి బాటిళ్లు కొనుగోలు చేయించి లాభాలు ఆర్జిస్తున్నారని ఏంజెల్ ఫ్రైడ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ (ఏపీసీఆర్‌పీఓ) ప్రతినిధులు తెలిపారు. స్వీట్స్ షాపులు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార నాణ్యత, శుభ్రత, చట్టవిధుల పాటింపు లోపాలపై ఏపీసీఆర్‌పీఓ రాష్ట్ర అధ్యక్షులు పిల్లి యజ్ఞనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శి కె.కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్లు మంగళవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. స్వీట్స్, చిరుతిండి పాకెట్లపై తయారీ తేదీ, గడువు ముగింపు తేదీలు పొందుపరచకుండా, గడువు ముగిసిన తేదీలను తొలగించి విక్రయిస్తున్నారన్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో రంగులు, రసాయనాలు, టేస్టింగ్ సాల్ట్‌లను ఉపయోగించడంతో పాటు, నిల్వచేసిన మాంసాన్ని వినియోగిస్తున్నారన్నారు. అనుమతి లేకుండా వాటర్ ప్లాంట్లను నడుపుతున్నారని, వాణిజ్య కార్యకలాపాలకు కమర్షియల్ గ్యాస్ సిలిండర్లకు బదులుగా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను ఉపయోగిస్తుండటం వల్ల గ్యాస్ సరఫరాపై ప్రభావం పడుతోందని ఫిర్యాదులో వివరించారు. వినతిపత్రం స్వీకరించిన జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, హోటళ్లు, రెస్టారెంట్లలో స్వచ్ఛమైన తాగునీరు ఉచితంగా అందించేలా చర్యలు తీసుకుంటామని, అనుమతి లేని మినరల్ వాటర్ ప్లాంట్లను గుర్తించి వాటిపై కూడా తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని సంస్థ ప్రతినిధులు జేసీని కోరారు.

మోడల్ పాఠశాలల్లో విద్యార్థులు చేరేలా ప్రోత్సహించాలి

- ఎంఈవో కృష్ణారెడ్డి
- నాదెండ్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సమస్యలపై చర్చ



మాట్లాడుతున్న ఎంఈవో

నాదెండ్ల: మండలంలో 14 ప్రాథమిక పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, ప్రతి పాఠశాలలో 4-5 మంది ఉపాధ్యాయులు ఉంటారని, పెద్ద సంఖ్యలో విద్యార్థులు చేరేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ఎంఈవో-2 ఈమని కృష్ణారెడ్డి చెప్పారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ తలతోటి రాణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 మంది విద్యార్థులకు పైబడిన పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఉంటారన్నారు. ఈ నెల 12న పాఠశాలలు పునః ప్రారంభంకానున్న నేపథ్యంలో ఇప్పటికే పాఠశాలలకు పాఠ్య పుస్తకాల పంపిణీ పూర్తయిందన్నారు. తొలి రోజే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కానుకను పంపిణీ చేస్తామన్నారు. ఎంపీపీ తలతోటి రాణి మాట్లాడుతూ మండలంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా మెరుగుపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో స్వరూపరాణి మాట్లాడుతూ ఈ నెల 12న ఉదయం 10 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నందున నలభై ఏళ్ల లోపు ఆరోగ్యవంతులైన యువతీ యువకులు రక్తదానం చేయాలని కోరారు. సంకురాత్రిపాడు మాజీ ఎంపీటీసీ మాట్లాడుతూ డొంక పోరంబోకు సర్వేకు దరఖాస్తు చేసినా నేటి వరకూ సర్వేయరు స్పందించలేదని వాపోయారు. సంకురాత్రిపాడు ఎంపీటీసీ సరస్వతి మాట్లాడుతూ తమ గ్రామానికి రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు అనుమతి వచ్చిందని, ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఖాళీ స్థలం ఉన్నందున భవన నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా జ్వరంతో అప్రమత్తంగా ఉండాలి

శావల్యాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నకర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం సీజను ప్రారంభం కానున్న నేపథ్యంలో దోమల నుంచి మలేరియా లాంటి వ్యాధులు సంభవించే అవకాశాలున్నాయని, ఈవ్యాధి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమల వ్యాప్తి చెందకుండా ప్రజలందరూ తగు జాగ్రత్తలు తీసుకునేలా వైద్య ఆరోగ్య అధికారులు సిబ్బంది అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. దోమల నుంచి సంరక్షణ చేసుకునేందుకు గాను దోమతెరలు వినియోగించాలన్నారు. అలాగే మురుగు కాల్వలో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ఆరోగ్య కేంద్రంలో రక్తపరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు తీసుకోవాలన్నారు. మలేరియా లక్షణాలు కల్గియున్న వారిని గుర్తిస్తే సత్వరమే వైద్యసేవలు అందేలా వైద్య ఆరోగ్య సిబ్బంది బాధ్యత వహించాలన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి రావిపూడి రమ్య, సూపర్‌వైజర్లు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి, ల్యాబ్ టెక్నీషియన్లు సతీష్, సీతారామిరెడ్డి తదితరులు ఉన్నారు.

కనపర్రులో కిశోర వికాసం

నాదెండ్ల: మండలంలోని కనపర్రు గ్రామంలో మంగళవారం అంగన్‌వాడీ కేంద్రం-6 నందు కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో శాంతకుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరిత్యా నేరమని, గ్రామాల్లో జరుగుతుంటే అధికారులకు సమాచారమివ్వాలని కోరారు. వ్యక్తిగత పరిశుభ్రత, మంచి పోషకాహారం, చక్కటి చదువుతో బాలికలు సమాజంలో ఆరోగ్యవంతంగా, ఉన్నతంగా రాణించవచ్చన్నారు. మహిళల పట్ల సమాజంలో జరుగుతున్న వేధింపులను నిలువరించేందుకు ప్రతి ఒక్కరూ చేయిచేయి కలిపి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రశాంతి, గ్రామపెద్దలు వజ్జా సింగయ్య, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి

ముప్పాళ్ళ: ప్రకృతి లేనిదే మనిషి జీవితం లేదని, భావితరాల భవిష్యత్తు కోసం పర్యావరణ సంరక్షణ మనందరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.అనంతలక్ష్మి చెప్పారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళలోని అంగన్‌వాడీ కేంద్రంలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాతృభూమి పరిరక్షణకై ఒక మొక్క నాటుదాం అనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి మాట్లాడుతూ పర్యావరణాన్ని వినాశనం చేస్తున్న ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండి పర్యావరణాన్ని ప్రేమిస్తూ మనవంతు కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్‌ను సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ మాతృభూమి పరిరక్షణ కోసం ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లోను మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. సచివాలయ మహిళా సంరక్షకురాలు ఎం.కోటేశ్వరమ్మ, హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు శ్రీలత, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంతంపై ఇంటింటి ప్రచారం



నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక నరసరావుపేట కమిటీ సభ్యులు భగవద్గీత-101 అనుబంధ గ్రంథాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు ఘడియం పెద్దిరెడ్డి మాట్లాడుతూ ద్వాపర యుగంలో కృష్ణుడు అర్జునుడికి జ్ఞానాన్ని ప్రబోధించాడన్నారు. ప్రపంచంలో ఉన్న ప్రతి మానవుడికి భగవద్గీత జ్ఞానంతో ఆత్మవికాసం కలుగుతుందన్నారు. సమాజంలో అధర్మం పెరిగిపోయి అశాంతి నెలకొనకుండా ప్రతి ఒక్కరూ జ్ఞానవంతులుగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎలిశెట్టి రమేష్, పగడాల రామయ్య, కోవూరి చినవెంకటేశ్వర్లు, కొరివి ఏడుకొండలు, అమరలింగయ్య, ఆంజనేయులు, పగడాల అశోక్, రాజశేఖరరెడ్డి, రాజేష్ ఉన్నారు.

రిజిస్ట్రేషన్ల పురోగతి వేగవంతం కావాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

శావల్యాపురం: అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఈనెల 21న జరగనున్న నేపథ్యంలో గ్రామ సచివాలయాల వారీగా ఆన్‌లైన్ నమోదు పురోగతి లక్ష్యాలను అధిగమించాలని మండల ప్రత్యేక అధికారి మూలె వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు నమోదు, గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వ సర్వేల పురోగతిపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామ సచివాలయాలు ఉండగా యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు 15 267 చేయాల్సి ఉండగా పెండింగ్‌లో లేకుండా త్వరితగతిన నూరుశాతం పూర్తి చేయాలన్నారు.112 యోగాసాలు వేసే ప్రదేశాలను గుర్తించినట్లు తెలిపారు. ప్రభుత్వ పరంగా చేయాల్సిన సర్వేలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఈవోపీఆర్‌డి పి.సుగుణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి

నరసరావుపేటటౌన్: పాత కక్షల నేపథ్యంలో మహిళపై ఇద్దరు దాడికి పాల్పడిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ హైమారావు మంగళవారం తెలిపారు. పెద్ద చెరువు 7వ లైన్లో నివాసం ఉంటున్న బత్తుల కొండమ్మకు బత్తుల శ్రీనివాసరావు, బత్తుల అంకమ్మరావుల మధ్య ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో కొండమ్మపై శ్రీనివాసరావు, అంకమ్మరావులు దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.